# దృష్టి

విశ్వనాథం మామూలు మనిషి కాదు. ఆంగ్ల సాహిత్యంలో పోస్టు గ్రాడ్యుయేట్ చేసి, ఒక ప్రైవేటు కంపెనీకి పెద్దగా ఉంటున్నాడు. అతని దృష్టిలో తన తండ్రి దీనుడు, ధూపం వేస్తే పాపం పోతుందని నమ్మే భక్తి పరుడు. దాపరికం చెయ్యడానికి ధనం లేనివాడు. వెల్లడి చెయ్యడానికి పెద్ద జ్ఞానం లేనివాడు. ఆ పల్లెను, పుట్టిన దగ్గరనుంచి గిట్టే దశ వస్తున్నా వదలనని మొండిపట్టు పడుతున్నవాడు.

ఆ పల్లెలో అంధ్రం అమరం అతనే పట్టించినా, ఆంగ్ల భాష వస్తేగాని అర్థబలం ఉండదని కొడుకును ఆనాడు పట్నం చదువుకు పంపించాడు ఈ తండ్రి సీతారామస్వామి. కొత్తగా మతం మార్పిడి చెందినట్లు విశ్వనాథానికి విశ్వమంతా ఆంగ్ల మయం అనిపించింది. విదేశాల కొకసారి వెళ్ళి రావడంతో విశ్వనాథం జీవిత సరళే మారిపోయింది ఇంగ్లీషు భాషలో మునిగి తేలుతూ, తెలుగు మాటనే మరిచిపోయే స్థితికి వచ్చాడు. కంపెనీ వ్యవహారాల్లో ఇంగ్లీషు అనుకుంటే, ఇంట్లోనూ ఇంగ్లీషే మాట్లాడుకోవడం, ఇంగ్లీషులో రాసుకోవడం, ఇంగ్లీషు పాటలూ, ఆటలూ - అంతా ఇంగ్లీషు మయమైపోయింది.

ఇక పై చదువులకు విశ్వనాథం ఒకే కొడుకు రమేశ్‌ను అమెరికా పంపిందాడంటే ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఈ కొడుకు అమెరికాలో

ఉంటున్న రోజుల్లోనే ఈ కుటుంబంలో ఒక విషాద సంఘటన జరిగింది. అప్పటికి సీతారామస్వామి వయస్సు డెబ్బయి ఎనిమిదేళ్ళు, విశ్వనాథానికి ఏభై అయిదు, రమేశ్ కి ఇరవై అయిదు.

ఆ పల్లెలో మూడు నెలల క్రితం కొడుకు వచ్చినప్పుడు తండ్రి కొడుకుల మధ్య సంభాషణ ఇలా సాగింది: ఆ పల్లెలో ఎప్పుడెలా అతని ఆరోగ్యం ఉంటుందో? వెయ్యి కిలోమీటర్ల పైగా దూరంలో నున్న తను తరచు రాగలడా? అందుకే తన దగ్గర కొచ్చేయమంటే - "పరవాలేదు. నువ్వు నా దగ్గర లేకుండా నా ప్రాణం పోదు'' అన్నాడు తండ్రి.

''ఎవరు చెప్పగలరు? అయినా ఇప్పుడా మాట లెందుకు?''

''నీ భయం అదే కదరా? నేను నీకు హామీ ఇస్తున్నాను. నా ఒక్క కొడుకూ నా దగ్గర లేకుండా చచ్చిపోనంటే చచ్చిపోను!"

తండ్రికున్న ఈ విశ్వాసం కొడుకు విశ్వనాథానికి లేదు.

"ఇంకా విను. పుట్టిన దగ్గరనుంచి పోయేవరకూ నా నడవడి అంతా నా మతం నాకు ప్రసాదించిన దృష్టితో సాగింది. నా కర్మకాండను నా మతం శాసించినట్లు నువ్వు చెయ్యకపోతే పరమాత్మను చేరుకునే నా ప్రయాసలో గుడ్డివానిగా జన్మజన్మలు ప్రయాణం చేస్తుంటాను. బ్రతికుండగా నాలో పాతుకున్న విశ్వాసం ఇది. అందుచేత నా కోర్కెను మరచిపోకు. అప్పుడు నా మాట పడిపోతే చెప్పలేనేమోనని ముందుగా ఇప్పుడే చెప్పేస్తున్నాను."

తండ్రి తాలూకా ఈ రెండు విశ్వాసాలను విశ్వనాథం చాలా తేలికగా తీసుకున్నాడు. ఒక విధంగా మనసులో హేళన చేసుకున్నాడు. పరీక్షకు నిలవని ఈ పిచ్చి నమ్మకాలంటే తనకు పరమ రోత. మూలాధారాలు లేనిది ఏదీ తను నమ్మడు. మతమౌఢ్యం తనకి అసలే కిట్టదు. తిరిగి వెళ్ళిపోయినా, తన మనసులో తండ్రి తలపే. ఆ గ్రామంలో అడ్డదిడ్డంగా నిలిచిన పాకలు, పందులు, వీధి కుక్కల విహారం, కనిపించే పెంట కుప్పల మధ్య మరుగుపడిన మాలిన్యంలా ప్రజల దారిద్ర్యం. ఇక్కట్లు, ఇబ్బందుల భారంతో క్రుంగిపోతూ, రోగాలతో చావుదెబ్బలు తింటున్న మనుషులమధ్య తన తండ్రి ఇన్నేళ్ళూ సాధించిందేమిటి? అతని తాతల కాలంనాటి మట్టి గోడల ఇల్లు తప్పించి, ఒక పెంకుటిల్లు కట్టించ గలిగాడా? దర్జాగా బ్రతకడానికి ఒక సిల్కు లాల్చీ వేసుకున్నాడా? నవ రుచులతో ఒక రోజు భోజనం చేశాడా? రోగం వస్తే పరీక్ష చేసి సరైన మందిచ్చే డాక్టర్ ఎవరైనా దగ్గర్లో ఉన్నాడా? తన దగ్గర పట్నంలో అన్ని సుఖాలతో హాయిగా, కనీసం ఈ చివరి రోజులైనా గడపమంటే అన్ని బాధలూ, ఇబ్బందులు పడుతూ ఆ పల్లెనే అంటిపెట్టుకునే అతని మొండిపట్టుకు విసుక్కున్నాడు.

విశ్వనాథం ఇంత వేగిరం ఈ ప్రాంతాలకు మళ్ళీ వచ్చే అవసరం లేదనుకున్నాడు. మూడు నెలలు నిండలేదు. ఒక కార్యక్రమంలో పాల్గొనమని ఆహ్వానం వచ్చింది. మొదట కాదనుకున్నా వాళ్ళు ఈ ప్రత్యేక ఉపన్యాసాలు ఇవ్వడానికి రానూ పోనూ విమానయానం ఖర్చు కూడా భరిస్తారన్నారని మనసు మార్చుకున్నాడు. మధ్యలో ఆదివారం కలిసి వచ్చిందని ఇంకేం తోచక, ఏభై కిలోమీటర్ల దూరంలో ఉన్న తన పల్లెకు అప్పటికప్పుడే అనుకుని, సాయంత్రానికి వచ్చేస్తానని ఉదయమే బయలుదేరి వెళ్ళాడు.

ఊర్లో తీరిక సమయం బస్సు దిగి నాలుగడుగులు వేసేసరికి కచేరి చావిడి దగ్గర మనుషులు, వాళ్ళ ఎదురుగా ఎండలో నిల్చుని నటిస్తూ పద్యా లెవరో చదువుతున్నారు. మరెవరు? సీతారామస్వామి! గయోపాఖ్యానం చివరి ఘట్టంలో ఉన్నాడు. కొడుకును చూడగానే ఒక్క గంతు వేశాడు.

"నాయనా! వచ్చావా?" కొడుకుకోసం ఎదురు చూస్తున్నట్లు అతని స్వరం పలికింది.

అంతా లేచిపోయారు.

"కొడుకు బొంబాయి వెళ్తే మనువడు అమెరికా వెళ్ళాడు. అదృష్టం అంటే మన మాస్టరు బాబుదే!" అని ఎవరో అంటే నవ్వేశాడు.

ఇంటికి వెళ్ళి కూర్చొని అదేపనిగా తండ్రి ఎన్నెన్నో విషయాలు చెప్తుంటే, ఇవి తనకు అనవసరం అనుకుని కొడుకు విని విననట్టు ఉన్నాడు.

భోజనాలయ్యాక తండ్రి నిద్ర పోలేదు. ఎడమకాలి ముడుకు వాచి ఉంది. కాస్త నొప్పిగా ఉన్నా, మనవడి బాల్య చేష్టలు తలచుకుంటూ, నవ్వుకుంటూ సీతారామస్వామి ఆపకుండా వాగుతున్నాడు. అలా నిల్చుని వాగుతూ వాగుతూ చప్పున క్రిందకు కూలిపోయాడు. కళ్ళు తేలవేస్తున్నాడు. మూతి వంకరయ్యే ముందు - "నాయనా! శలవై పోయిందిరా!" ఇవే ఆఖరి మాటలు.

ఊరిలో డాక్టరు లేడు. పొరుగూరినుంచి డాక్టరును తెచ్చే అవసరం లేకపోయింది. ముక్కులోనుంచి రక్తం కారి, గడ్డ కట్టుకపోయింది. సెరిబ్రల్ హెమెరేజ్‌తో సీతారామస్వామి పోయాడు.

ఊరు ఊరంతా అక్కడ చేరిపోయింది. ఇరుగు పొరుగు ఊర్లనుంచి బంధువు లొచ్చేశారు. తనకన్నా వయసులో పెద్దవాడు, చావుకున్న తంతులన్నీ తెలిసినవాడు ఆజ్ఞాపిస్తూ తంతంతా జరిపిస్తున్నాడు. అతను ఏది చెయ్యమంటే యాంత్రికంగా అది చేస్తున్నాడు. శవం మోయడానికి, దహనానికి కావలసిన అన్ని హంగులూ వాళ్ళే అమర్చేస్తుంటే, అలా చూస్తూ ఉండిపోయాడు. ఆ తంతులు చేస్తున్నప్పుడు పొందిన అనుభూతిని కొడుకుకు విశ్వనాథం రాసిన ఉత్తరం చదివితే తెలుస్తుంది.

"ప్రియమైన రమేశ్!

వివరణకు అందిన విషయాలనే నమ్మాలి అని ఒకసారి నీతో అన్నట్లు గుర్తు. కానీ, జీవితంలో వివరణకి అందనివి కొన్ని సంఘటనలు జరుగుతుంటాయని మీ తాత చావు నాకు గుర్తు చేసింది. నేను అసలు వెళ్ళాలని అనుకోలేదు. కానీ, నీ తాత విశ్వాసం నన్ను తాడుకట్టి లాక్కొని వెళ్ళేటట్టు చేసింది. అతని రెండో కోర్కె ఆ తంతులన్నీ చెయ్యమనడం. నిజానికి ఇవన్నీ చెయ్యడం నా కిష్టం లేదు. అతను తన దేహం నడవడిక ఒక దృష్టితో సాగిందన్నాడు. ఈ దృష్టి ఏమిటో అతను బ్రతికుండగా నాకు బోధపడలేదు. బహుశ ఈ దృష్టి ఇప్పుడు ఏమిటో తెలుసుకోగలనేమో? ఆ ఉద్దేశంతోనే అతను కోరినట్లు కర్మకాండను చెయ్యడానికి పూనుకున్నాను.

"నీ తాత చివరిమాట విన్నప్పుడైనా నా మనసు చలించలేదు. నా కళ్ళలో నీరు తిరగలేదు. అతని భౌతిక కాయాన్ని తాకుతూ నేను స్నానం చెయ్యించాను. ఇదొక తంతు. అతని శరీరాన్ని ముట్టగానే నాలో ఒక విద్యుత్తు ప్రవాహం చొచ్చుకున్నట్లు శరీరమంతా జలదరించింది. అతను నా మీద పెట్టుకున్న ఆశలూ. అభిమానం, ప్రేమానురాగాలన్నీ అలల్లుగా ప్రవహించి నా శరీరం లోనికి చొచ్చుకున్న ట్లనిపించింది. నా కళ్ళలో నీరు నిండింది.

వీథిలో కదులుతున్న శవం ముందు నడుస్తున్నాను. ప్రజల నోటినుంచి విన్న మాటలివి.

''అందరి నోటా అమృతం పోసిన మారాజు. అతను వొగ్గయిపోయినా, మంచిని వదిలిపోయాడు పురాణాలు వల్లించి, మా చెవుల్లోని దుమ్ము దులిపాడు. మా ఎదర అడీ - పాడీ మాకు అన్నం పెట్టినంత పుణ్యం సంపాదించుకున్నాడు. ఆ బాబు ఎదరగా నిల్చుంటే దొంగోడైనా అబద్దం ఆడగలడా? ఇక ఆ బాబుతో సరి. అయ్యో! ఈ దేముడు లాంటి తాతమీద పేలాలు జల్లే అదృష్టం ఆ మనవడికి దక్కలేదు."

"మా మాస్టారుబాబు మాకు సదువు చెప్పి పురాణాలు చదవడం నేర్పినాడు. మామూ ఒక కొమ్ము కాస్తాం" అని ఆ ఊరి జనులు కూడా అతని శవాన్ని మోశారు. నేను చుట్టూ ప్రదక్షిణ చేసి, తలకి నిప్పంటించేటప్పుడు అనిపించింది- నా పట్టుదలలు, అపనమ్మకాలు, అంతా తెలుసునన్న దర్పంతో ఇతను బ్రతికి ఉండగా ఇతని తలలో ఎంత అగ్నిని రగుల్కొలిపానో ఇప్పుడు ఆ తలని కొరకంచుతో కాల్చి వేస్తున్నాను.

మూడో రోజు అస్థికలు ఏరడానికి శ్మశానానికి వెళ్ళాను. ఏం చూశాను? కాలిన ఎముకల గూడు. ఇదేనా ఎముకల గూడును సృష్టించింది! జీవిత గమనంలో ఎదురయ్యే గాలి వానలను, వరద వెల్లువలను తట్టుకొని నిల్చిన

మనోహర శిల్పంలా ఆ కాలిన గూడు కనిపించింది. ఆ ఆకారం ఇప్పుడే కాదు - నా చివరి క్షణాలవరకు నా మనసులో నిల్చుండిపోతుంది. నాలుగు దిక్కులు తిరిగి, నాలుగు మొక్కులు మొక్కి ఏరిన అస్థికలు పట్టుకొని తిరిగి వస్తుంటే నా కనిపించింది - నా తండ్రిని బ్రతికుండగా తెలుసుకునే దృష్టి నా చదువు ఇవ్వనిది. అతను బూడిదై ఆ దృష్టిని నాకు ప్రసాదించాడేమో!

ఈ దృష్టితో నీ తాత చివరి పలుకుల్లోని అంతరార్థాన్ని అన్వేషించడం మొదలుపెట్టాను. శెలవయిపోయిందిరా అన్నారు చివరి మాటగా. అంటే అతన్ని ఎవరో రమ్మని పిలవటం చూస్తున్నట్లేగా! చావు - బ్రతుకుల మధ్య అంతరం ఒక సూది మొనంత దూరమైనాకాదు. మనిషి చచ్చిపోయాక, ఈ జీవి ఏమవుతుందో ఎవరూ చెప్పలేరు. సూది మొన క్రింద ఉండి ఆ రెండో వైపు చూస్తున్నట్లు అతని మాటలు చెప్తున్నాయి. బహుశః ఈ శక్తే తను కోరినట్లుగా తన చివరి ఘడియల్లో అంత దూరంనుంచి నన్ను తన దగ్గరకు రప్పించిందని, చిరునవ్వుతో అన్న ఆ చివరి మాటలే అతని ఆనందపు వెలుగును వెదజల్లి నా చేత ఈ కర్మకాండంతా జరిపించి, నాకు దృష్టిని ప్రసాదించిందనుకుంటాను.

నా తండ్రిని నేను, అతను గతించాకనే అతను ప్రసాదించిన దృష్టితోనే అర్థం చేసుకోగలిగాను.

—నీ నాన్న".

అమెరికా నుంచి కొడుకు రమేశ్ రాసిన జవాబిది:

''ప్రియమైన నాన్నగారికి,

మీరు రాసిన విషయాలు ఆసక్తితో చదివాను. మనిషికి దృష్టి ప్రయోజనం అనుబంధాలను పెంచడానికే అని తెలుసుకున్నాను నా విషయంలో ఈ అనుబంధాలను పెంచడానికి తండ్రిగా మీరేం చేశారు? తాతయ్యగా అతనేం చేశారు? అన్న ఆలోచనలను మీ ఉత్తరం ప్రేరేపించింది.

మీకు నాతో గడపడానికి సమయం దొరికేదికాదు. తాతయ్యను కలుసుకున్నప్పుడల్లా అతని సమయం అంతా నాదే. మీరు నాచేత షేక్స్పియర్, మిల్టన్ చదివించారు. నా ఇంగ్లీషు మీడియం చదువుతో నా మాతృ భాషకు దూరమయ్యాను. తాతయ్య తెలుగు రాయడం, చదవడం నేర్పించారు. ఉపనిషత్తుల సారం నుంచి రామాయణ, భారత కథలు, శంకరుల అద్వైతంవరకు నాకు అర్థమయ్యేలా చెప్పారు. సుఖంగా బ్రతకడానికి మీరు పాశ్చాత్య భాష సంస్కృతి, సంపర్కం కలిగిస్తే తాతయ్య భారతీయ దర్శనం-అంటే ఆ విజన్ నాలో చొప్పించి మనిషిగా నాకో ఆదర్శం ఉందని గుర్తుచేశాడు. ఇంగ్లీషు భాషలో

భారతీయ దర్శన సంబంధమైన పుస్తకాలు చదివాను. నేను తెలుసుకున్న దేమంటే, ఆ ఆదర్శం చేరాలంటే ధర్మార్థ కామ మోక్షాల లక్ష్యసిద్ధిని పొందాలి. దీనికి సాధన అవసరం. సాధనను అనుభవం ఇస్తుంది. ఒక వ్యక్తి అనుభవం సృజనాత్మకమైనది. ఏ వ్యక్తి చేసిన సృజనాత్మక సృష్టి ఆ జాతి దృష్టిలో ఒక భాగమైపోతుంది. తాతయ్య నాకు నాది - నా జాతిపరమైన దృష్టిని అతను బ్రతికుండగానే ప్రసాదించారు. ఇంత దూరంలో నేనున్నా అందుకే తాతయ్య నా ఊహల్లో నిత్యం మెసులుతూనే ఉన్నారు.

నా జాతి దృష్టితో, వీళ్ళ భాష సహాయంతో ఇక్కడ ఈ జాతి ఆలోచనా సరళి, జీవిత విధానం, సంస్కృతిని చూస్తున్నాను. ఈ రెండు సంస్కృతుల రాపిడిలో ఏ ఒక్క అగ్నికణం రాలి ప్రకాశించినా అది నా దృష్టిని తేజోవంతం చేస్తుందని నమ్ముతున్నాను.

మీ రమేశ్.''

విశ్వనాథం కొడుకు ఉత్తరం చదివాక చాలా సేపు మౌనంగా కూర్చుండి పోయాడు తరువాత ఒక ఎయిర్‌గ్రాంపై - ''నీ ఉత్తరం చదివి గర్వపడ్డాను. నీ అన్వేషణ జయప్రదం కావాలని కోరుతున్నాను'' అని తొలిసారి కొడుకుకు తెలుగులో ఉత్తరం రాశాడు. *

(1991)